ఆస్తి పన్ను వసూళ్లపై విభజన సమస్యల ఎఫెక్ట్

- నిబంధనల మేరకు ప్రభుత్వ భవనాలపై పదేళ్ల వరకే ఏపీకి హక్కులు
- గడువు ముగిసినా తెలంగాణ పరిధిలోకి రాని ఆస్తులు
- ఏపీకి కేటాయించిన భవనాలకు పన్ను చెల్లించని ఆ రాష్ట్ర అధికారులు
- వసూళ్ల లక్ష్యంపై ప్రభావం పడుతుందంటున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఖైరతాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు సమయంలో కొన్ని ప్రభుత్వ భవనాలను రెండు రాష్ట్రాలు వినియోగించుకునేలా విభజించారు. చాలా ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఒకే భవనంలో అంతస్తుల వారీగా కేటాయింపులు జరిపారు. ఈ విధానం పదేళ్ల పాటు అమల్లో ఉంటుందని.. ఆ తర్వాత తెలంగాణకు శాశ్వత ఆస్తులుగా ఉంటాయని విభజన ప్రక్రియలో పేర్కొన్నారు. అయితే ఏపీకి కేటాయించిన భవనాలను ఆ రాష్ట్ర పాలకులు, అధికారులు మధ్యలోనే ఖాళీ చేసి వెళ్లిపోయారు. పది సంవత్సరాలు పూర్తయినా ఆ భవనాలను తెలంగాణ ఆస్తులుగా పేర్కొంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో వాటి ఆస్తిపన్ను విషయమై వివాదం నడుస్తోంది. అప్పట్లో ప్రభుత్వ భవనాలకు ఒకే పిటిన్ నంబర్ ఇచ్చి ఆస్తిపన్నును నిర్ధారించగా ప్రస్తుతం బకాయి ఉన్న పన్నులో ఎవరెంత కట్టాలనే విషయమై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. దీంతో ఆయా ప్రభుత్వ భవనాల పన్ను బకాయి పడడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు తలలు పట్టుకొంటున్నారు. మరో ఐదు రోజుల్లో లక్ష్యాలను సాధించేందుకు కసరత్తు జరుగుతుండగా ఈ విభజన సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుందని సిబ్బంది భావిస్తున్నారు.



ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

ఏసీబీ కార్యాలయం, వైఎస్ఆర్ భవన్‌ల పన్ను రూ.2 కోట్లకు పైనే

జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఏసీబీ కార్యాలయంలో ఇప్పటికీ తెలంగాణ, ఏపీలకు చెందిన ఆస్తులు ఉన్నాయి. తెలంగాణకు చెందిన వాటాను చెల్లించగా, ఏపీకి చెందిన పన్ను గత పదేళ్లుగా రావడం లేదు. ఏసీబీ కార్యాలయం నుంచి దాదాపు రెండున్నర కోట్ల రూపాయలు రావాల్సిఉంది. ఈ కార్యాలయ ఆస్తులను పూర్తిగా తెలంగాణకు కేటాయించకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే కోవలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 13లోని వైఎస్ఆర్ భవన్‌లో నాలుగంతస్తులు ఉండగా రెండు అంతస్తుల్లో తెలంగాణ ఇరిగేషన్ శాఖ, మరో రెండు అంతస్తుల్లో ఏపీకి చెందిన ఇరిగేషన్ శాఖలకు విభజించారు. ఏపీకి చెందిన అంతస్తులు చాలా రోజులుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో దాదాపు రెండు కోట్ల రూపాయల ఆస్తిపన్ను ఈ భవనం నుంచి రావాల్సి ఉంది. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి పన్ను బకాయి ఉన్న ఇలాంటి ప్రభుత్వ భవనాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో చాలానే ఉన్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించి భవనాలను పూర్తిస్థాయిలో తెలంగాణకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


సెహరీ కార్యక్రమంలో పాల్గొన్న శివసేనారెడ్డి తదితరులు

సెహరీ నిర్వహణ అభినందనీయం

- శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

బోరబండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే వారికోసం సెహరీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బోరబండ సైట్-1 కాలనీ కమాన్ వద్ద బుధవారం తెల్లవారుజామున కార్పొరేటర్ ఎండీ బాబాఫసియుద్దీన్ ఏర్పాటు చేసిన సెహరీ కార్యక్రమంలో రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డితో కలిసి శివసేనారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోరబండలో గంగా-జమున తహెజీబ్ ఉట్టిపడే విధంగా కుల మతాలకు అతీతంగా ముస్లింలకు సహకరించడం గొప్ప విషయమన్నారు. పదేళ్లుగా రంజాన్ మాసంలో రోజూ 5 వందల మందికి సెహరీ నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. అనంతరం పలువురికి రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, వివిధ బస్తీల నాయకులు కాసుల మహేష్, చెట్టి దేవేందర్, రజీ, రజాక్, ఆనంద్, బాలరాజు గౌడ్, కవిత, లక్ష్మి నాయక్, షేక్ వలీ, చెన్నయ్య, వినయ్, మున్నా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నందినగర్‌లో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలు, చెత్త

పేరుకుపోయిన రోడ్డు నిర్మాణ వ్యర్థాలు

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

బంజారాహిల్స్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వెనుక రోడ్డు నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి. తొలగించండంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిర్మాణ వ్యర్థాలలో కొందరు చెత్త వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. నందినగర్‌లో రోడ్డు నిర్మాణం పూర్తయి రెండు నెలలు దాటినా వ్యర్థాలను తొలగించలేదు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలను తొలగించాలని స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. మరోవైపు రోడ్డు నిర్మాణ సమయంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు సక్రమంగా పరిశీలించకపోవడంతో నందినగర్‌లో నిర్మించిన రోడ్లు అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. అయితే కొంతమంది నేరుగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని కలిసి ఫిర్యాదు చేయడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వెంటనే పేరుకుపోయిన రోడ్డు నిర్మాణ వ్యర్థాలతో పాటు చెత్తను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం.

ట్రాన్స్‌కోకు చెందిన కాపర్ వైర్ చోరీ

బంజారాహిల్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌కోకు సంబంధించిన కాపర్ వైర్‌ను చోరీ చేశారు. తుకారం గేట్‌కు చెందిన పి.శ్రీధర్ ఎర్రగడ్డ టీజీ ట్రాన్స్‌కో సంస్థలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ దేవాలయం వద్ద విద్యుత్ తీగలను పరిశీలించేందుకు వచ్చాడు. కాగా అక్కడ ఉండాల్సిన 200 మీటర్ల కాపర్ వైర్‌తో పాటు నిచ్చెన కనిపించలేదు. దీంతో 25 వేల రూపాయల విలువచేసే కాపర్ వైర్, నిచ్చెన చోరీకి గురైనట్లు శ్రీధర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్స్ సరఫరా చేస్తానని నమ్మించి మోసం

బంజారాహిల్స్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కూల్ డ్రింక్స్ బల్క్‌లో సరఫరా చేస్తామంటూ సైబర్ నెరగాళ్లు ఓ వ్యాపారి వద్ద రూ.44 వేలు తీసుకుని మోసం చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14కు చెందిన మిద్దెల ఆలనారెడ్డి జీహెచ్‌ఎంసీ క్రీడా ప్రాంగణాల్లో తినుబండారాలు, కూల్ డ్రింక్స్ సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో కేబీహెచ్‌బీ క్రీడాస్థలంలో కూల్ డ్రింక్స్ సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూటర్ల కోసం ఆన్‌లైన్‌లో వెతికాడు. ఓ వ్యక్తి కరాఫా ప్రొడక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడిగా పరిచయం చేసుకొని తాను కోక్ డీలర్‌నని చెప్పాడు. సరుకు, ఫ్రిడ్జ్ సరఫరా చేస్తానని నమ్మించి పలు దఫాలుగా రూ.44,052 వసూలు చేసి ఆ తర్వాత ఫోన్‌కు స్పందించడం మానేశాడు. మోసపోయినట్లు గ్రహించిన ఆలనారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో వసతి పేరుతో..

తిరుమలలో వసతి కల్పిస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు వ్యక్తిని మోసం చేశారు. కమలాపురి కాలనీలోని సాయి నిలయంలో నివసించే చిరుమామిళ్ల ప్రసాదరావు తిరుమల వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో వసతి కోసం వెతికాడు. అమన్ పరస్ అనే వ్యక్తి వసతి కల్పిస్తానని నమ్మించి రూ.10వేలు యూపీఐ పేమెంట్ ద్వారా తీసుకున్నాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. మోసపోయినట్లు గ్రహించిన ప్రసాదరావు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

పంజాగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున అమీర్‌పేట గ్రీన్‌ల్యాండ్స్‌లో చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా ఆల్కహాల్ తీసుకున్నట్లు తేలింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా కల్లు తాగి వాహనం నడిపినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏఎస్ రావునగర్ ప్రాంతానికి చెందిన జీవీవీబీ కిషోర్(52) జూబ్లీహిల్స్‌లోని ఓ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న సాయంత్రం విధులకు వెళ్లిన ఆయన 26న తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. గ్రీన్‌ల్యాండ్స్ సిగ్నల్ వద్ద ఓ వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పి.బద్దు సింగ్(60)ను పోలీసులు అరెస్ట్ చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

అమీర్‌పేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అమీర్‌పేటలోని ఓ హోటల్ వద్ద కొందరు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారం మేరకు వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి అమీర్‌పేట సత్యం టాకీస్ ఎదురుగా ఉన్న అమోఘ హోటల్ వద్ద ముగ్గురు వ్యక్తులు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని పశ్చిమ మండల టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఐపీఎల్ మ్యాచ్‌కు బేగంపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ నజీర్ (21), అబ్దుల్ నయీమ్ (22), బోరబండకు చెందిన తాహిర్ (35) బెట్టింగ్ నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు తదుపరి విచారణ నిమిత్తం నిందితులను ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

లంబాడీలను మంత్రివర్గంలోకి తీసుకోవాలి

- గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్

పంజాగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజికవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ గిరిజన ఎంప్లాయిస్ అసోసియేషన్(తెగ) రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రనాయక్, తెలంగాణ స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు హరికిషన్ నాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీలు కీలక భూమిక పోషించారని, త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే కాంగ్రెస్ పార్టీకి లంబాడీలు అండగా ఉంటారన్నారు. ఈ సమావేశంలో సురేష్ నాయక్, సుబ్బు నాయక్, రమేష్ రాథోడ్, భావసింగ్, నరేందర్ పవార్,నందు నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏర్పాటులో మాది కీలక పాత్ర

రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బంజారా(లంబాడీ)లకు మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గిరిజన లంబాడీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజన, లంబాడీ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు అశోక్ రాథోడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాన్ని కూల్చి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో తమ పాత్ర కీలకమన్నారు. బంజారా సమాజం ఏకపక్షంగా ఓట్లు వేసి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిందని, ఇందిరా గాంధీ హయాం నుంచే కాంగ్రెస్ పార్టీతో బంజారా బిడ్డలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ఈ సమావేశంలో జీఎస్ఎస్ అధ్యక్షుడు లకపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్

రజకులను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలు

- ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

పంజాగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం రజక సామాజిక వర్గానికి అన్ని పార్టీలు సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఓయూ జేఏసీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంపల శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర మంత్రివర్గంలో తమ కులం నుంచి ఒకరికి చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర రజక సామాజికవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రజక సమాజాన్ని చైతన్య పరిచేందుకు త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటించి సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాల పర్యటన అనంతరం లక్షలాది మందితో నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు తమ సామాజిక వర్గాన్ని విస్మరిస్తున్నాయని, తమను గ్రామ బహిష్కరణ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కె.వెంకన్న, మురళి, కె.పోశం, శ్రీకాంత్, శేఖర్, రజక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంపల శ్రీనివాస్

'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్'ను విజయవంతం చేద్దాం

- కాంగ్రెస్ శ్రేణులకు కార్పొరేటర్ విజయారెడ్డి పిలుపు

ఖైరతాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలో విజయవంతం చేద్దామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి అన్నారు. బుధవారం ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఇందులో కార్యక్రమం చేయాల్సిన అవసరంపై విజయారెడ్డి అవగాహన కల్పించారు. దీంతో పాటు నియోజకవర్గంలో కార్యక్రమాల ప్రణాళికను వివరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జాతిపిత గాంధీని, డాక్టర్ అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని, ఈ విషయమై ప్రజలందరినీ చైతన్యపరిచేందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.


కార్యకర్తల సమావేశంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న విజయారెడ్డి

కొత్త కారు బ్రేక్‌డౌన్ అవుతోంది..
షోరూం వద్ద వినియోగదారుడు ఆందోళన

హైదరాబాద్ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కారు కొన్న నాలుగు రోజులకే బ్రేక్ డౌన్ అయిందని షోరూంకు తీసుకువస్తే వినియోగదారుడిపైనే దాడి చేసిన ఘటన మాదాపూర్‌లో జరిగింది. బాధితుడు సామల రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని తేజస్విని టాటా మోటార్స్‌లో అక్టోబర్ 10న టాటా సఫారి కారు కొన్నాడు. కొన్న 10 రోజుల్లోనే బ్యాటరీ ఫెయిల్యూర్‌తో కారు ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 5 సార్లు కారు ఆగిపోయింది. సర్వీసుకు ఇచ్చినప్పుడల్లా వారం పదిరోజులు ఉంచుకుని ఇస్తున్నారు తప్ప కారులో ఉన్న లోపాన్ని సరిదిద్దడం లేదు. ఈ కారు డిఫెక్ట్‌తో ఉందని, దీన్ని తీసుకొని కొత్త కారు ఇవ్వాలని, లేదంటే డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే దానికి షోరూం నిర్వాహకులు అదనపు వారంటీ ఇస్తామంటూ చెబుతున్నారే తప్ప, ఎలాంటి గ్యారెంటీ ఇవ్వడం లేదని బాధితుడు వాపోయాడు. ఇలాంటి కారుతో తాను బయటికి వెళ్లలేకపోతున్నానని, కొత్త కారు ఇలా కావడం ఏంటని అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండా తనపై దౌర్జన్యం చేస్తున్నారని, షోరూం నుంచి బయటకు పంపిస్తున్నారని కారు యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. షోరూం నిర్వాహకులు తన సమస్యను పరిష్కరించకపోవడంతో తన కారుకు బ్యానరు కట్టి షోరూం ముందు నిలబడి తాను కారు కొనుగోలు చేసిన తర్వాత ఎదురైన సమస్యలను, అనుభవాలను పేర్కొంటూ నిరసన తెలిపాడు. దీంతో షోరూం ముందు వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కారు యజమాని, షోరూమ్ నిర్వాహకులతో మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చేశారు.

కార్మికులకు ఈఎస్ఐ హెల్త్ కార్డులివ్వాలి

ఎర్రగడ్డ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఈఎస్ఐ హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఎఫ్‌ను ప్రతినెలా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ నేత అశోక్ డిమాండ్ చేశారు. ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు చెందిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో కలిసి దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్ సర్వీసెస్ గ్లోబల్ కాంట్రాక్ట్ ఏజెన్సీ కార్మికులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. 7 నెలలుగా పీఎఫ్‌ను జమ చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీధర్, లింగయ్య, లక్ష్మి, చంద్రకళ, లత తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులపై ప్రచారం ముమ్మరం

ఖైరతాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం 5 రోజులే ఉండటంతో జీహెచ్‌ఎంసీ అధికారుల్లో ఆందోళన పెరుగుతోంది. ఐదు రోజుల్లో లక్ష్యాలను చేరుకునేందుకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జంట సర్కిళ్లలో అధికారులు, సిబ్బంది వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా వన్ టైం సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను చెల్లించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఆటోల్లో స్పీకర్లను ఏర్పాటు చేసి మైక్ అనౌన్స్‌మెంట్లు చేయడంతో పాటు పలు ప్రధాన కూడళ్లలో బ్యానర్లను ఏర్పాటు చేశారు.


యూత్ అసెంబ్లీలో మాట్లాడుతున్న జయేష్ రంజన్

దేశ భవిష్యత్తు యువత చేతిలోనే

- ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్

బంజారాహిల్స్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలనతో పాటు విద్య, వైద్యం ఉచితంగా అందించినప్పుడే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు యువకులు అన్నారు. జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో బుధవారం యూత్ అసెంబ్లీ పేరిట మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ప్రపంచం ఎదుర్కోబోయే సమస్యల గురించి చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందన్నారు. యువత నాయకత్వ లక్షణాలను పెంచుకొని పారదర్శకంగా ప్రజలకు సేవలందించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి వినీత్ గంగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.


ఏఎన్ఆర్ శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి అక్కినేని శత జయంతి ఉత్సవాలు

అమీర్‌పేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రనాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని కమ్మసంఘం భవనంలో గురువారం నుంచి ఈ నెల 30 వరకు అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ, ఆంధ్రనాటక కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాదరావు వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ఆరు నాటికలు, ఒక పద్య నాటకం ప్రదర్శించనున్నామన్నారు. తొలిరోజు అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావుకు అక్కినేని జీవిత సాఫల్య సాధన పురస్కారం, 28న సామాజిక సేవకుడు డాక్టర్ గొలుగూరి వెంకటరెడ్డికి ఆంధ్రనాటక కళాపరిషత్ జీవిత సాఫల్య సాధన పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి కమ్మ సంఘం హాల్‌లో ప్రదర్శించే నాటకాలను ఉచితంగా వీక్షించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


మానవసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

కొనసాగుతున్న అన్నదానం

అమీర్‌పేట మార్చి 26(ఆంధ్రజ్యోతి): మానవసేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం కొనసాగుతోంది. మార్చి 1న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 7 వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు బుచ్చిబాబు తెలిపారు. బుధవారం సనాతన ధర్మబాల సంస్కరణ సమితి బాలబాలికలు తమ తల్లిదండ్రుల సహకారంతో ఇంట్లో భోజనాలు తయారు చేయించి సుమారు 4 వందల మందికి అందజేశారు. బుచ్చిబాబు మాట్లాడుతూ.. వేసవిలో పనుల మీద నగరానికి వచ్చే వారిని దృష్టిలో ఉంచుకొని అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.

ఇఫ్తార్ సందడి


రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా బుధవారం బంజారాహిల్స్ రెనోవా హస్పిటల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న నగర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఆస్పత్రి ఎండీ డాక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు

\- బంజారాహిల్స్, మార్చి 26(ఆంధ్రజ్యోతి)

ఇద్దరి యువకుల ప్రాణాలు తీసిన అతివేగం

రాంగోపాల్‌పేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సరోజిని దేవీ రోడ్డు(ఎస్డీ రోడ్డు)లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన ద్విచక్రవాహనం స్థానికంగా ఓ చౌరస్తాలో కారును ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువకులు మరణించారు. సికింద్రాబాద్ మహంకాళి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేటకు చెందిన యర్ర హర్షిత్ (21), దేవి ప్రణయ్ (17) మారేడ్‌పల్లిలోని ఓ పెస్టికంట్రోల్ సంస్థలో రాత్రి వేళల్లో ఉద్యోగం చేస్తుంటారు. మంగళవారం విధులు పూర్తి చేసుకున్న వీరిద్దరూ బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తమ సంస్థ యజమానికి చెందిన ద్విచక్రవాహనంపై ప్యారడైజ్ హోటల్‌కు వెళ్లి అక్కడి నుంచి ప్యాట్నీ వైపు అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎస్డీ రోడ్డులోని ఓ చౌరస్తాలో మరోవైపు నుంచి వస్తున్న కారును ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన దేవి ప్రణయ్ అక్కడికక్కడే మరణించాడు. యర్ర హర్షిత్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. హర్షిత్ తండ్రి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్/యజమాని కుర్మయ్య(32)పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కంటోన్మెంట్‌లో జైబాపు జైభీమ్ జైసంవిధాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బోయినపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు జైభీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ నియోజకవర్గం డైమండ్ పాయింట్‌లో గాయత్రిగార్డెన్‌లో ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగేతర చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ఎదుర్కోవడానికి ఏఐసీసీ పిలుపుమేరకు ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డునెంబర్ 1, 2, 6 వార్డులోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో దిశా నిర్దేశం చేయడం జరిగింది. కార్యక్రమంలో జైబాపు జైభీమ్ జైసంవిధాన్ అభియాన్ కోఆర్డినేటర్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, నాయకులు బద్దం బల్వంత్‌రెడ్డి, సదా, వినోద్, కరన్, మారుతీగౌడ్, హరికృష్ణ, శామ్యూల్, భవానీ, కొల్లాపూర్ గోమతి, వందన, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే విజయం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే విజయమని ఆ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బుధవారం సీతాఫల్‌మండిలో ఆర్‌కేఎం ఫంక్షన్‌హాల్‌లో స్థానిక డివిజన్ అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి శత జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, ఒకే దేశం, ఒకే ఎన్నికలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మేధావులు, అడ్వొకేట్స్, సైంటిస్టులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులతో పాటు అన్నివర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సంవత్సరం పొడవునా వాజ్‌పేయి శతజయంత్యుత్సవాలను జరపడానికి కార్యకర్తలు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, కనకట్ల హరి, ప్రభ గుప్తా, నాయకులు అంబాల రాజేశ్వరరావు, ఆకారం రమేష్, బాస్కరగిరి, సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ పనుల ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న భానుక నర్మద

తిరుమలగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద బుధవారం వార్డ్-8 పరిధిలోని సరస్వతి నగర్‌లో రూ.25 లక్షలతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని కాలనీలు మురికి వాడల్లో ఎండాకాలంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంచినీటిపై దృష్టి సారించి కంటోన్మెంటుకు మరో 20 లక్షల గాలన్‌ల నీటిని తమకు సరఫరా చేయాలన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తికాగానే సరస్వతి నగర్, సాయిబాబ కాలనీ, వెంకటేశ్వర నగర్, అన్న నగర్, చింత బాయి, రుద్రా నగర్ పంప్‌హౌజ్ కాలనీ లకు మంచి నీటి సమస్య ఉండదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాణుక మల్లికార్జున్, జేవీ నర్సింగ రావు, ధనంజయ్, వార్డ్-8 అధ్యక్షుడు ప్రవీన్, జైనపల్లి శ్రీకాంత్, కిరణ్ కుమార్ ముదిరాజ్, వెంకటేశ్వర కాలనీ ప్రెసిడెంట్ నాగేంద్ర, సరస్వతి నగర్ కాలనీ ప్రెసిడెంట్ పుల్లారెడ్డి, సాయి బాబ, డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంటు సిబ్బంది సేవలు మరువలేనివి



సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్

తిరుమలగిరి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంటు సిబ్బంది విధి నిర్వహనలో భాగంగా పౌరులకు ఎనలేని సేవలు అందిస్తున్నారని కంటోన్మెంటు బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. తిరుమలగిరి లాల్‌బజార్‌లోని వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన దఫేదార్ చంద్రశేఖర్ పదవీ విరమణ వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ స్థానికుల సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న చంద్రశేఖర్ చేసిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీఈఓ పల్లవి, బాలన్ నాయర్, మహేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళీ ముదిరాజ్, కొల్లాపూర్ గోమతి తదితరులు పాల్గొన్నారు.

శత జయంతికి సిద్ధం!

- 1927లో లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రి స్థాపన
- లక్ష మందికి వైద్య సేవలు..
- ఏడాదికి మందుల ఖర్చు రూ. 250కోట్లు
- 72 మంది డాక్టర్లు, నర్సులు, సహాయక సిబ్బంది 208
- అత్యాధునిక వైద్య పరికరాలు
- ప్రసవాలు, ఫిజియోథెరపి, చర్మ వ్యాధుల నివారణకి ప్రథమ స్థానం



లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రి

చిలకలగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): దాదాపు శతాబ్దం కాలంగా రైల్వే కార్మికులు, ఉద్యోగులు, రైలు ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రయాణికులకు వైద్యసేవలు అందజేస్తోంది లాలాగూడ, కేంద్రీయ రైల్వే ఆస్పత్రి. శత జయంతికి సిద్ధమవుతోంది.

1927వ సంవత్సరంలో నిజాం రైల్వేలో ఆరోగ్య కేంద్రంగా ప్రారంభమై, అంచెలంచెలుగా అభివృద్ధి చెంది 1972వ సంవత్సరంలో పూర్తి స్థాయిలో భవనం ఏర్పరచబడింది. ప్రస్తుతం 40వేల మంది రైల్వే కార్మికులు, ఉద్యోగులతో పాటు 50వేల మంది పెన్షనర్లు వివిధ రైల్వేల నుంచి నగరంలో స్థిరపడిన వారిని కలుపుకొంటే దాదాపు లక్ష మంది ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు. 72 మంది డాక్టర్లు, 138 మంది నర్సులు, 70 మంది సహాయక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

రోజూ 2 వేల మంది ఔట్ పేషంట్స్

ఏడాదికి మందుల ఖర్చు దాదాపు 250కోట్లు.. ప్రతి రోజూ 2వేల మంది ఔట్ పేషంట్స్ వస్తుంటారు. భారతీయ రైల్వేలోనే అత్యధిక సురక్షిత ప్రసవాల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. ఒక సమయంలో ప్రైవేట్ వారు బయట నుంచి వచ్చి డబ్బు చెల్లించి ఇక్కడ గైనకాలజీ సేవలు పొందేవారు. అంతటి పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. చర్మవ్యాధుల విభాగంలో ఉత్తమ డెర్మటాలజిస్టులను తయారు చేయడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

వైద్య సేవలు

రక్తపోటు, మధుమేహం తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు అవసరమైన మందులు మూడు నెలలకి సరిపడా ఒకేసారి అందజేస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలకి రిఫర్ చేస్తారు. అభివృద్ధి పనులు.. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఇటీవల రూ.4.5కోట్ల వ్యయంతో సిటీ స్కాన్ మిషిన్, ఔషధ మొక్కల పార్కు, క్యాంటీన్ సౌకర్యం లాంఛనంగా ప్రారంభించారు. 20 పడకల ప్రత్యేక వార్డు, క్యాథ్ లాబ్, సెంట్రలైజ్డ్ ఏసీ, శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం, చుట్టూ ఎత్తైన ప్రహరీ నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు.

ప్రసూతి విభాగం సేవలు బేష్



మా ఇద్దరు అమ్మాయిలు ఇక్కడే పుట్టారు. ప్రసూతి విభాగం సేవలు ప్రశంసనీయం. అప్పట్లో బయట నుంచి వచ్చి డబ్బు చెల్లించి ఇక్కడ చేరి సేవలు వినియోగించుకునే వారు. డాక్టర్లు, నర్సులు, ఆయాలు ఆత్మీయంగా పలుకరించి సేవలు అందజేసేవారు. నయా పైస అడిగే వారు కాదు. ఇచ్చి తీసుకునే వారు కాదు.

\- యూ. శ్రీనివాస్, మాజీ రైల్వే ఉద్యోగి

మెరుగైన సేవలకు కృషి



పదవీ విరమణ చేసిన వారు 25 మంది బృందంగా ఏర్పడి నడవలేని రోగుల ఇళ్లకి వెళ్లి అందజేస్తుంటాం. కరోనా వచ్చినప్పుడే చాలా మంది ఇంటింటికి వెళ్లి మందులు ఇచ్చి వచ్చాం. క్యాథ్ ల్యాబ్, ఎంఆర్ఐ మెషిన్, సెంట్రలైజ్డ్ ఏసీ వంటివి ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆస్పత్రులకి దీటుగా వైద్య సేవలు అందజేయాలని జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ మెడికల్ డైరెక్టర్లకి వినతి పత్రాలు అందజేశాం. లోకల్ పర్చేజ్ మందుల పంపిణీలో జాప్యం తగ్గించాలి. సీనియర్ సిటిజన్స్ గంటల తరబడి వెయిట్ చేయాల్సివస్తోంది.

\- పి.యుగంధర్, ఆల్ ఇండియన్ రైల్వే మెన్ ఫెడరేషన్, జోనల్ కార్యదర్శి

అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): టౌన్ ప్లానింగ్ విభాగంపై జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సికింద్రాబాద్, బేగంపేట్ సర్కిళ్లలో ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాల విషయమై టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భవన నిర్మాణాలు చేస్తుంటే ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. అదనపు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా, సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నా, నిబంధనలను గాలికి వదిలేస్తున్నా పట్టించుకోకపోతే ఎలా? అంటూ ప్రశ్నించారు. పౌరుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నా, మీడియాలో కథనాలు వెలువడుతున్నా అప్రమత్తంగా లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు సర్కిళ్లకు చెందిన ఇద్దరు కీలక అధికారులకు ఆయన మెమో జారీ చేశారు.

మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి



సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బౌద్ధనగర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలని కోరుతూ బుధవారం సీతాఫల్ మండి అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాదిగ సోషలిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పలువురు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగాలన్నీ మాలలకే దోచిపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పదవులను మాలలకే దోచిపెట్టడం సిగ్గుచేటన్నారు. మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నందారం సీతారాంమాదిగ, దయాల నర్సింగరావు, రాజలింగం, యుగంధర్, రాజమౌళి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



నల్లగుట్టలో బుధవారం రహీం భాయ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్, మాజీ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ, మాజీ అతెల్లి అరుణ గౌడ్

\- రాంగోపాల్‌పేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి)

సికింద్రాబాద్ కోర్టు బార్ అసోసియేషన్ మహిళా ఈసీ సభ్యురాలిగా అనిత



అడ్డగుట్ట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సివిల్ కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని కొంత మంది ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ మహిళా కార్యవర్గ సభ్యురాలిగా చొప్పర అనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ అసోసియేషన్‌లో మూడు వేలకు పైగా ఉన్న సభ్యత్వంలో తనను కార్యవర్గ సభ్యురాలిగా నియమించడం ఆనందంగా ఉందని అనిత పేర్కొన్నారు. ఏపీ ఒంగోలు సమీపంలోని గ్రామీణ ప్రాంతమైన కనుమల గ్రామంలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చదివి తెలంగాణ న్యాయవాది తనకంటు ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా అనిత్ మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో నిరుపేదల కోసం ఉచిత న్యాయ సహాయ శిబిరాలను నిర్వహిస్తామన్నారు.

రైల్వే ఆస్పత్రికి 10వీల్ చైర్స్ అందజేత



డాక్టర్. శివ నాగప్రసాద్‌కి వీల్ చైర్స్ అందజేస్తున్న రామకృష్ణ కుటుంబ సభ్యులు

చిలకలగూడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం తల్లి సీతామహాలక్ష్మి, తండ్రి డి.వెంకటరావు జ్ఞాపకార్థం 50వేల విలువ చేసే 10వీల్ చైర్లు మాజీ అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ డి.రామకృష్ణ అందజేశారు. లాలాగూడ కేంద్రీ రైల్వే ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శివనాగ ప్రసాద్, డాక్టర్ శివనాగ ప్రసాద్ మాట్లాడుతూ... సంపదలో కొంత సమాజ సేవకి వినియోగిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రతి ఒక్కరూ సేవా భావం, మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు దామోదర ప్రసాద్, మదన్ మోహన్, ప్రముఖ రైల్వే వాలీబాల్ క్రీడాకారిణి అరుంధతి, జగదీష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సిలంబమ్‌లో మహీధర్‌కు స్వర్ణం



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సీబీఎస్ఈ రాష్ట్ర సిలంబమ్ చాంపియన్‌షిప్ అండర్-12 బాలుర విభాగంలో మహీధర్ (ఆర్చిడ్ స్కూల్) స్వర్ణం సాధించాడు. బుధవారం సైనిక్‌పురిలోని వీజే స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్ర సంప్రదాయ సిలంబమ్ సంక్షేమ సంఘం ఈ పోటీలను నిర్వహించింది. బాలుర విభాగంలో మహీధర్ స్వర్ణం, ఆయూషమన్ (ఇండస్ స్కూల్) రజతం, రుద్ర (భారతీయ విద్యా భవన్స్) కాంస్యం నెగ్గారు. బాలికల విభాగంలో తనూజ (భారతీయ విద్యా భవన్స్) స్వర్ణం, లాస్య (సెయింట్ మార్టిన్స్) రజతం, జష్విత (భారతీయ విద్యా భవన్స్) కాంస్యం సాధించారు. సిలింబమ్ సంఘం కార్యదర్శి బాల్‌రాజ్ విజేతలకు పతకాలు ప్రదానం చేశారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- కారును ఢీకొట్టిన ద్విచక్రవాహనం.. ఇద్దరు యువకుల మృతి





దేవి ప్రణయ్, యర్ర హర్షిత్ (ఫైల్)



ప్రమాదానికి గురైన వాహనాలు

రాంగోపాల్‌పేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సరోజిని దేవీ రోడ్డు(ఎస్డీ రోడ్డు)లో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దూసుకొచ్చిన ద్విచక్రవాహనం స్థానికంగా ఓ చౌరస్తాలో కారును ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువకులు మరణించారు. సికింద్రాబాద్ మహంకాళి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేటకు చెందిన యర్ర హర్షిత్(21), దేవి ప్రణయ్(17) మారేడ్‌పల్లిలోని ఓ పెస్ట్‌కంట్రోల్ సంస్థలో రాత్రి వేళల్లో ఉద్యోగం చేస్తుంటారు. మంగళవారం విధులు పూర్తి చేసుకున్న వీరిద్దరూ బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తమ సంస్థ యజమానికి చెందిన హార్లీడేవిడ్‌సన్ ద్విచక్రవాహనంపై ప్యారడైజ్ హోటల్‌కు వెళ్లి అక్కడి నుంచి ప్యాట్నీ వైపు అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎస్డీ రోడ్డులోని ఓ చౌరస్తాలో మరో వైపు నుంచి వస్తున్న కారు(క్యాబ్)ను ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన దేవి ప్రణయ్ అక్కడికక్కడే మరణించాడు. యర్ర హర్షిత్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. హర్షిత్ తండ్రి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్/యజమాని కుర్మయ్య(32)పై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వైద్యుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఓ వైద్యుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అల్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... కాప్రా ప్రధానంపురి కాలనీ ప్రాంతానికి చెందిన పురోహిత్ ప్రకాశ్ మల్(34) అల్వాల్‌లోని బస్తీ దవాఖానలో ఎంబీబీఎస్ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలవల్ల బుధవారం అశ్వికదళ్ బ్యారెక్స్ (అల్వాల) సమీపంలో హాజర్ సాహిబ్ (నాందేడ్) ఎక్స్‌ప్రెస్) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వ్యక్తి గత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే పోలీసులు బావిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 10వ నెంబరు ప్లాట్ ఫాం ఆవరణలోని మజీద్ ఏటీఎం సెంటర్ల వద్ద గుర్తుతెలియని (45) వ్యక్తి మృతి చెందిఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

500 గ్రాముల శిశువుకు మెరుగైన వైద్యం



వివరాలను వెల్లడిస్తున్న డైరెక్టర్ వైద్యురాలు పద్మావతి, వైద్య బృందం

మారేడుపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నెలలు నిండకుండానే పుట్టిన నవజాత శిశువుకు మారేడుపల్లి బసంత్ షెనాయ్ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందించి అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఈమేరకు బుధవారం బసంత్ షెనాయ్ డైరెక్టర్ వైద్యురాలు పద్మావతి వివరాలను వెల్లడించారు. గాంధీనగర్‌కు చెందిన రామ్ కుమార్, దీపాలి దంపతులు ప్రసవానికి మూడు నెలల ముందు 500గ్రాముల మగ శిశువుకు జన్మనిచ్చినట్టు డైరెక్టర్ పద్మావతి తెలిపారు. పుట్టిన పసికందు ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో పాటు శరీరంలో అవయవాల పనితీరు సరిగా లేకపోగా బసంత్ షెనాయ్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శిశువుకు వైద్య పరీక్షలు నిర్వహించి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. మూడు నెలల అనంతరం బరువు ఒక కేజీ 800 గ్రాములు పెరిగిందన్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోవడంతో వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మాజీ డైరెక్టర్ గిరిజ కృష్ణ, డాక్టర్ మానస, వినయ్ డాక్టర్ మురళి, అడ్మినిస్ట్రేటివ్ రామ్ రెడ్డి, నర్సుల బృందం పాల్గొన్నారు.

'తెలుగు భాషకు పద్యం సౌందర్యం'

చిక్కడపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పద్యం సౌందర్యం అని ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. తెలుగు పద్యనాటకంలో పద్యం సందేశం నీతితో కూడి ఉంటాయని చెప్పారు. శ్రీరామ కృష్ణా నాట్యమండలి ఐదు దశాబ్దాల వేడుకలు ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈసందర్భంగా నవ జీవితంలో నాటక పద్యం అంశంపై గరికిపాటి నరసింహారావు విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. కొడుకు బెట్టింగ్‌లో లక్షలు నష్టపోతే తండ్రి తాను దాచుకున్న డబ్బును ఇచ్చిన వార్తను ఉదహరిస్తూ చింతామణి నాటకంలోని పద్యాలను చెప్పి తండ్రి ప్రేమ వివరించారు. రంగస్థల కళాకారుడు సివిఎన్ కృష్ణ ఆధునిక నాటక వికాసం అంశంపై ప్రసంగం చేశారు. నిర్మలా నృత్యనికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మాస్టర్ సాయి శంకర్ భారతీయుడు ఏకపాత్రాభినయం చేశారు. తొలుత శరత్ కౌశిక్ వేద పఠనం చేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, రంగస్థల ప్రముఖుడు డా. జొన్నలగడ్డ జగన్‌మోహన్‌రావు స్వాగతం పలికిన సభలో శ్రవణ్‌కుమార్, మల్లెల సాయి శివరామ్, ఆదిలక్ష్మి, కల్యాణి, లక్ష్మికాంతశర్మ పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం

- కంటోన్మెంట్ ఆస్తిపన్ను వసూళ్లపై ప్రభావం

సికింద్రాబాద్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ ప్రతిపాదనల ప్రభావం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆస్తిపన్ను వసూళ్లపై పడ నుంది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో భాగంగా చేపట్టనున్న రోడ్డు విస్తరణలో తమ ఆస్తులు కోల్పోవడమో, పాక్షికంగా నష్టపోవడమో జరుగనున్న వాదనతో చాలా మంది ఆస్తిపన్ను చెల్లించడానికి విముఖత ప్రదర్శిస్తుండడంతో కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగానికి దిక్కు తోచడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో వారి నుంచి పన్ను వసూలు చేయడమెలాగో తెలియక అధికారులు సతమతమవుతున్నారు.

పన్ను ఎలా చెల్లిస్తాం

సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి రాజీవ్‌రహదారి మీదుగా తూంకుంట వరకు, నాగపూర్ జాతీయ రహదారి మీదుగా కొంపల్లి వరకు ఎలివేటెడ్ క్యారిడార్లు నిర్మించాలని బీఆర్ఎస్ చాలా కాలం క్రితమే ప్రతిపాదించడం, కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రక్షణ శాఖతో సంప్రదింపులు జరిపి, ఈ నిర్మాణానికి రక్షణ శాఖ భూములు కేటాయించేలా చొరవ తీసుకున్న సంగతి విదితమే. రక్షణ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్‌రహదారిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కారిడార్ నిర్మాణానికి రేవంత్‌రెడ్డి అలా భూమి పూజ చేశారో, లేదో.. ఇలా ఆ రహదారిలోని దుకాణాలు, వర్తక, వాణిజ్య కట్టడాలు ఒక్కటొక్కటిగా ఖాళీ చేయడం ప్రారంభమైంది. నిర్మాణ పనులు ప్రారంభమైతే... ఆ సమయంలో తమకు అనువైన స్థలాలు, దుకాణాలు, భవనాలు లభిస్తాయో, లేదో అనే కారణంతో కొందరు ముందుగానే జాగ్రత్త పడుతున్నారు. చుట్టుపక్కల ఖాళీగా ఉన్న భవనాలకు తమ దుకాణాలను షిఫ్ట్ చేసుకుంటున్నారు. మరి కొందరు ఆ ఏరియా నుంచి శాశ్వతంగా ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. రాజీవ్ రహదారిలోని సికింద్రాబాద్ క్లబ్ నుంచి తూముకుంట వరకు 600 ప్రైవేటు ఆస్తులు, కట్టడాలు ఉన్నాయని అంచనా, వీటిలో ఇప్పటి వరకూ 10 శాతంపైగా ఖాళీ అయినట్టు రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. ఈ రహదారిని కూడా 200 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించారని, కనీసం 150 అడుగుల మేరకు కుదించినా తమకు ఉపశమనం లభిస్తుందని వారు స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదకు పలు మార్లు మొర పెట్టుకున్నారు. వారి నుంచి ఇప్పటి వరకూ స్పష్టమైన హామీ లేకపోవడంతో కట్టడాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూలు పేరిట కంటోన్మెంట్ బోర్డు అధికారులు, సిబ్బంది రంగంలో దిగుతుండడంతో భరించలేకపోతున్నారు. తమ ఆస్తులు, భవనాలు కూలపోతున్నాయని స్పష్టంగా తెలుస్తున్న తరుణంలో తాము పన్ను ఎలా చెల్లిస్తామంటూ నిలదీస్తున్నారు. దాంతో వారికి సమాధానం చెప్పలేక అధికారులు సతమతమవుతున్నారు.



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సతీష్‌గుప్తా తదితరులు

పన్ను మినహాయించండి : సీఈఓకు వినతి

రాజీవ్ రహదారిలో ఉన్న ఆస్తులు, కట్టడాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా తదితర సభ్యులు బుధవారం కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌కు విజ్ఞప్తి చేశారు. వారు పడుతున్న ఆవేదనను ఆయనకు వివరించారు. ఎలివేటెడ్ క్యారిడార్ల నిర్మాణం శంకుస్థాపన జరుగగానే చాలా వరకు దుకాణాలు, భవనాలు ఖాళీ అయ్యాయని చెప్పారు.

దీనికి మధుకర్ నాయక్ స్పందిస్తూ... పూర్తిగా ఖాళీగా ఉన్న వాటి వివరాలు, ఖాళీ కాకముందు చెల్లించిన విద్యుత్ బిల్లులు, ఖాళీ అయిన తర్వాత నుంచి ఇప్పటి వరకూ చెల్లిస్తున్న విద్యుత్ బిల్లులు జతచేసి, తమకు అందజేస్తే వాటిపై ఖాళీ అయిన కాలం వరకు 50 శాతం రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.